# పెద్దలమాట



అనగా అనగా అనగా—

అవంతి అని ఓ పెద్దనగరం ఉంది. ఆ నగరానికి ఓ రాజుగారున్నారు. ఆ రాజుగారికి పూవులన్నా, పూలతోటలన్నా చలా ఇష్టం. అందుచేత ఆయనగారు నగరంలోనూ, దానికి చుట్టూరానూ ఎన్నో పూల తోటలు వేయించారు. ఆ తోటల నిండా రంగు రంగుల పూలు అన్ని కాలాల్లోను పూస్తూ ఉంటాయి. సాయంకాలం పూటా, తీరుబాటు ఉన్నప్పుడూ ఆ నగరంలో ఉండేవాళ్ళు అందుబాటులో ఉండే తోటల్లో కూచుని సరదాగా కాలక్షేపం చేస్తూ ఉండేవారు.

ఈ తోటల సంగతి ఓ సీతాకోకచిలుక విన్నది.

రెండు రోజుల్లో తన కుటుంబంతోసహా అక్కడికి వచ్చింది.

సీతాకోక చిలకకు ఇద్దరు చిన్న చిన్న బిడ్డలున్నారు. ఈ పాపాయిలు కూడా దానికి చాలా కాలం తరువాత కలిగారు. అందుచేత వాళ్ళిద్దర్నీ ఎంతో గారాబంగా అమ్మ చిలకా, నాన్న చిలకా పెంచుతున్నాయి.

ఇది కొత్త చోటనీ, ఇక్కడ మనుషులు ఎక్కువగా ఉంటారనీ, అందులోనూ బాలలు ఎక్కువగా వస్తూవుంటారనీ, వారి కళ్ళ బడితే ఇహ వదలిపెట్టరనీ, కాబట్టి ఎక్కడికీ కదలవద్దనీ నాన్న చిలక పిల్లలకు చెప్పింది. అవి "సరే" అన్నాక, పెద్దవి మేతకోసం వెళ్ళిపోయాయి.

పెద్దవారిద్దరూ వెళ్ళిపోగానే చిలక బాలకు ఓ ఆలోచన వచ్చింది. అమ్మా నాన్నా చాలా సేపటికి గాని రారుగదా. అందాకా ఈ ఆకుల మాటున కూచోడం కన్నా, కాసేపు అటూ ఇటూ తిరిగి వస్తేనేం ?

ఇలా అనుకుని ఆ సీతాకోకచిలుక బాల ఓసారి కొమ్మ మీదికి ఎగిరి ఓ క్షణం అక్కడ కూచుంది. ఆకుల కిందుగా వొంగి తోటనంతా చూసింది. అల్లంత దూరంలో బుడ్డి బుడ్డి పట్టు దుస్తులేసుకొని ఇద్దరు పిల్లలు ఆ పూల మొక్కల చాటున కూచుని ఉన్నారు. వారి బుగ్గలు ఎర్రగా కంది పోయాయి. కళ్ళు తడిసి ఉన్నాయి. పాపం అప్పటిదాకా ఏడిచి ఏడిచి అలిసిపోయారు గావును-మధ్య మధ్య బెక్కుపడుతున్నారు కూడా.

కాసేపు వారితో ఆడుకొందామనుకొంది మన చిన్ని సీతాకోక చిలుక. ఓసారి రెక్కల్ని అటూ ఇటూ చాపి, చివ్వుమని గాలిలోకి

ఎగిరింది. అలా ఎగురుతుంటే దానికి చాలా కొత్తగా, గమ్మత్తుగా ఉంది. అలా ఎగురుతూ ఎగురుతూ ఆ పిల్లల ముందుకొచ్చింది. వారూ దీన్ని చూశారు. చూసి కన్నీళ్ళు తుడుచుకొన్నారు. ఇప్పుడు వారి కన్నుల్లో విచారంలేదు. అవి అప్పుడు కడిగిన ముత్యాల్లా మెరిసి పోతున్నాయి. దాన్ని పట్టుకోడానికి వారిద్దరూ లేచారు చిలకబాల కూడా వారిని దగ్గరదాకా రానిచ్చి ఇంకో క్షణంలో సగంలో వారు తనను పట్టుకొంటారనగా చివ్వుమనిలేచి నాల్గుగదు గిరికీలు కొట్టి ఓ వరస అవతలగా ఉన్న పూలమొక్కల మీద వాలింది. ఈ పిల్లలిద్దరూ ఆ సీతాకోకచిలక కోసం అక్కడికొచ్చారు. ఇలాగా చాలాసేపు చాలాదూరం వారిని తిప్పిందా చిన్న చిలుక. ఇక అది చిక్కదనుకొని పిల్లలిద్దరూ వెళ్ళిపోయారు.

వెళ్ళిపోయాక దానికి తన ఇల్లెక్కడో తెలియలేదు. రెక్కలు పులిసి పోయేలాగా ఆ తోటంతా తిరిగింది. 'అమ్మా అమ్మా' అంటూ బిగ్గరగా ఏడిచింది. ఇక ఇల్లు తను కనుక్కోలేనన్న భయంతో అది వణికిపోయింది.

చాలా సేపటికి దాని అమ్మా నాన్న వచ్చారనుకోండి. కానీ పెద్దవారి మాటలు వింటే దానికిన్ని అగచాట్లు, తిప్పలు ఉండేవి కాదు గదా!